

**యువగళం హామీలు నెరవేర్చాలి**

మంత్రి నారా లోకేష్ యువగళం పాద యాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. 8లో



**సింహగిరికి పోటెత్తిన భక్తులు**

సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. 8లో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఉదయం నుంచి అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



**సిరులతల్లికి విశేష పూజలు**

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల సందర్భంగా శనివారం కనకమహాలక్ష్మి అమ్మ వారికి విశేష పూజలు నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### విద్యుత్ పొదుపుతో భవితకు భరోసా



విద్యుత్ వారోత్సవాల ర్యాలీని ప్రారంభించి, మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్

అనకాపల్లి: విద్యుత్‌ను పొదుపు చేసి భావితరాలకు భరోసా కల్పించాలని, అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని, సోలార్ విద్యుత్‌పై ప్రతి ఒక్కరూ దృష్టి సాధించాలని ఏపీఈపీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్, జేసీ జాహ్నవిలు తెలిపారు. విద్యుత్ వారోత్సవాల సందర్భంగా సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ర్యాలీని స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద జెండా శనివారం పృథ్వీతేజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక యూనిట్ పొదుపు రెండు యూనిట్ల ఉత్పత్తికి సమానమని, ప్రతి ఒక్కరూ సోలార్‌ను ఉపయోగించుకుని విద్యుత్ పరికరాలను వాడుకోవాలని ఆయన కోరారు. ఒక ఏసీ 40 సీలింగ్ ఫ్యాన్లతో సమానమని చెప్పారు. ఎల్ఈడీ బల్బుల ద్వారా విద్యుత్‌ను పొదుపుచేయవచ్చన్నారు. ఈనెల 20వ తేదీ వరకూ విద్యుత్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సుంకరమెట్ట జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈలు రాజశేఖర్, రామకృష్ణ, సురేఖ, ఏడీఈ రామారెడ్డి, ఏఈలు, విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

### లోక్ అదాలత్ తీర్పుకు తిరుగులేదు



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి

చోడవరం రూరల్: లోక్ అదాలత్‌లో తీర్పునకు తిరుగులేదని, పై కోర్టులో అప్పీలు చేసుకునే ఆస్కారం లేదని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు.అందుకే ఇరు వర్గాల సంపూర్ణ సమ్మతితో లోక్‌అదాలత్‌లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే కాలయాపన, ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ మాట్లాడుతూ పేదలకు న్యాయసహాయం అందుతుందని చెప్పారు. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అప్పలరాజు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కృష్ణవేణి తదితరులు ప్రసంగించారు.

అధికారం మాది...అడిగేదెవడన్నట్టు కూటమి నాయకులు బరితెగించారు. నీటి సంఘాల ఎన్నికల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కొన్ని చోట్ల బెదిరింపులు...కుట్రలకు పాల్పడ్డారు. రైతులు ఎన్నికల్లో పాల్గొనకుండా నీటి తీరువా చెల్లించేందుకు అడ్డంకులు సృష్టించారు. కొన్ని చోట్ల నీటి తీరువా కట్టించుకుని, రశీదులు ఇవ్వవలసిన ఉద్యోగులు రైతులకు అందుబాటులో లేకుండా పోయారు. పలు చోట్ల తోపులాటలు, వాగ్వాదాలు, ఆందోళనలు, ధర్నాలతో ఈ ఎన్నికలు సార్వత్రిక పోరును తలపించాయి. ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసే విధంగా కూటమి నాయకులు వ్యవహరించారని పలువురు రైతులు తీవ్రంగా విమర్శించారు.

# నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి బరితెగింపు



ఎ. కొత్తపల్లిలో ఎన్నికల అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ మద్దతుదారులైన రైతులు

- అప్రజాస్వామికంగా ఎన్నికలు
- నోడ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులపై కూటమి నేతల ఒత్తిళ్లు
- పోటీ లేకుండా కుట్రలు పన్నిన నాయకులు
- సహకరించిన అధికారులు
- ఎన్నికలను బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ
- జిల్లాలో 281 స్థానాల్లో ఏకగ్రీవం
- 8 స్థానాల్లో పోటీ
- 11 స్థానాల్లో ఎన్నికలు వాయిదా
- 285 చోట్ల కూటమి, నాలుగు చోట్ల టీడీపీ వ్యతిరేక వర్గం గెలుపు

సాక్షి, అనకాపల్లి:

అప్రజాస్వామికంగా నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించింది. సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఎన్నికల ముందు రోజు వరకూ కూటమి నాయకుల ఒత్తిడి మేరకు రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారు. నీటి తీరువా బకాయిలు కట్టించుకోకుండా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రైతులను ఇబ్బందులకు గురి చేసి పోటీ చేయకుండా జిల్లాలో అడ్డుకున్నారు. కేవలం కూటమి పార్టీ మద్దతుదారులైన రైతుల నుంచే నీటితీరువా బకాయిలను కట్టించుకున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలను ఏకగ్రీవం చేసుకునేందుకు టీడీపీ నాయకులు అధికార యంత్రాంగాన్ని గుప్పెట్లో పెట్టుకున్నారు. అంతేకాకుండా వైఎస్సార్‌సీపీ మద్దతు రైతులకు పోటీ చేయడానికి వీలులేకుండా నోడ్యూస్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకుండా అధికారులపై కూటమి నేతలు తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో అప్రజాస్వామికంగా నిర్వహిస్తున్న ఈ నీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించింది.

**ఫోన్లు స్విచ్ఛాఫ్... సిబ్బంది మాయం**

మునగపాక మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేద్దామని పలువురు రైతులు ఆసక్తి చూపినప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించలేదు. నోడ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వవలసి వస్తుందని రెండు రోజుల ముందు నుంచే ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసేశారని పలువురు రైతులు తెలిపారు.

సాగునీటి సంఘ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా నీటితీరువా పన్ను చెల్లించాల్సి ఉంది. పన్ను చెల్లించినట్టు వీఆర్వో ధ్రువీకరిస్తేనే ఎన్నికలో నామినేషన్ దాఖలు చేయాలన్న నిబంధన ఉంది. అయితే పలువురు రైతులు తాము పోటీ చేద్దామనుకున్నా వీఆర్వోలు అందుబాటులో లేకపోవడంతో ఆవేదనకు గురయ్యారు.



ఎన్నికలు వాయిదా వేయడంపై నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ వర్గీయులు

**281 సంఘాల ఎన్నిక ఏకగ్రీవం**

జిల్లా వ్యాప్తంగా 300 సాగు నీటి సంఘాలున్నాయి. వీటిలో 281 సంఘాల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎనిమిది చోట్ల ఎన్నికలు జరిగాయి. 11 చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. వైఎస్సార్‌సీపీ పోటీ నుంచి దూరంగా ఉండడంతో 285 నీటి సంఘాలను కూటమి మద్దతుదారులు కైవసం చేసుకోగా...నాలుగు చోట్ల టీడీపీకి వ్యతిరేకంగా రైతులు పోటీ చేసి ఏకగ్రీవంగా గెలిచారు.

**నాలుగు చోట్ల కూటమికి ఎదురు దెబ్బ**

నాలుగు చోట్ల అధికార కూటమికి వ్యతిరేకంగా రైతులు ఎన్నికల్లో పాల్గొని ఏకగ్రీవంగా గెలుపొందారు. కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు పన్నిన కుట్రలను రైతులు ఎదుర్కొన్నారు. నీటి తీరువా పెండింగ్ పన్నులు చెల్లించకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేసినా పోరాటం చేసి పన్నులు చెల్లించారు. నక్కపల్లి మండలంలో మూడు నీటి సంఘాలలో చైర్మన్లు, ఐదు సంఘాల్లో వైస్ చైర్మన్లు, 30 డైరెక్టర్ల స్థానాలను టీడీపీ వ్యతిరేక వర్గం రైతులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. గొడిచర్ల, ఉద్దండపురం, చినదొడ్డుగొల్లు నీటి సంఘాలు అధికార టీడీపీ వ్యతిరేకంగా రైతులు బరిలోకి దిగి ఏకగ్రీవంగా గెలిచారు. వీటితో పాటుగా మండల పరిధిలో 30 డైరెక్టర్ల స్థానాలు కూడా కైవసం చేసుకున్నారు.

- చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండల పరిధిలో వెదుళ్లవలసలో నిర్వహించిన సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు స్థానిక రైతులు ఏకగ్రీవంగా గెలుపొందారు.

**11 చోట్ల వాయిదా**

జిల్లాలో 11 సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. కె.కోటపాడు మండలంలో గొండుపాలెం, వి.సంతపాలెం గ్రామాల్లో గల నీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. గొండుపాలెంలో గల సీతమ్మ చెరువు పరిధిలో గల ఆరు టీసీ స్థానాలకు తెలుగుదేశం పార్టీలోనే రెండు వర్గాలకు చెందిన మద్దతుదారులు పోటీలో నిలిచారు. ఎన్నిక నిర్వహించే సమయానికి ఆ రెండు వర్గాల వారు ఘర్షణకు దిగారు. దీంతో రిటర్నింగ్ అధికారి ఎన్నికలను వాయిదా వేశారు.

- వి.సంతపాలెంలో నాగారాయుడి చెరువు పరిధిలో గల ఆరు టీసీ స్థానాల్లో నామినేషన్ పత్రాలు ఇచ్చే సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఎన్నిక వాయిదా వేశారు.
- బుచ్చెయ్యపేట మండలంలో మంగళాపురం కాలువకు ఎన్నికలు జరగలేదు. పోటీకి రైతులు ఆసక్తి చూపలేదు.
- విజయరామరాజు పేటలో డైరెక్టర్ల ఎన్నిక జరిగింది. చైర్మన్ ఎన్నిక వాయిదా వేశారు.
- రావికమతం మండలం గుడ్డిప గ్రామంలో టీడీపీ వ్యతిరేక వర్గీయులు అధికంగా ఉండడంతో ఎన్నిక వాయిదా వేశారు.
- మాడుగుల మండలంలో కోనాం జలాశయం పరిధిలో గల శిరిజాం నీటి సంఘం -2 ఎన్నిక వాయిదా పడింది. ఈ నీటి సంఘానికి టీడీపీ మద్దతుదార్లు రెండు వర్గాలుగా విడిపోయి, పోటీలో ఉండడంతో శాంతి భద్రతల సమస్య తలెత్తి, వాయిదా వేశారు.
- దేవరాపల్లి మండలంలోని ఎ.కొత్తపల్లి రెడ్డివాని పెద్దివాని చెరువుకు సంబంధించిన నీటి సంఘం ఎన్నిక ప్రక్రియలో పోలింగ్ అధికార్లు కూటమి నేతలకు అనుకూలంగా వ్యవహరించడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో వాయిదా వేశారు.

## అడ్డుకున్నా గట్టిపోటీ

నక్కపల్లి: మండలంలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో స్థానిక రైతులు బరిలో నిలిచి టీడీపీకి గట్టిపోటీ ఇచ్చి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకున్నారు. గొడిచర్ల బాపిరాజు చెరువు, కొత్త చెరువు, ఉద్దండపురంలో ఊర చెరువుల సంఘాలను కైవసం చేసుకునేందుకు టీడీపీ పావులు కదిపింది. స్థానిక రైతులు ఆందోళన చేయడంతో పోటీ అనివార్యమైంది. గొడిచర్ల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ వద్ద ఓటర్ల జాబితా విషయమై తీవ్ర వివాదం నెలకొంది. బాపిరాజు చెరువుకు టీడీపీ మద్దతుతో చైర్మన్‌గా పోటీ చేసే వెలగా బాబూరావు పేరు గల్లంతుకావడంతో అతని వర్గీయులు ఆందోళనకు దిగారు. ఈ చెరువు వివాదం కారణంగా ఎటువంటి వివాదం లేని కొత్త చెరువుకు ఎన్నికలు నిర్వహించకుండా జాప్యం చేయడం తగదంటూ రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సీఐ కుమార స్వామి, ఎస్ఐ సన్నిబాబు, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎన్నికల అధికారి ఉమా ప్రసాద్‌లు ఏకగ్రీవం చేసుకుంటే అభివృద్ధికి అవకాశం ఉంటుందని సూచించడంతో మొత్తంమీద రెండు చెరువులకు సంబంధించి 12 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తచెరువుకు చెర్మన్‌గా నల్లల వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్‌గా గెద్దమూరి వెంకటరమణ, డైరెక్టర్లుగా కర్రి కృష్ణారావు,గెద్దమూరి వెంకటసూర్యనారాయణ, ఇసరపు చిన్నారావు, కోరుకొండ రమణారావు ఎన్నికయ్యారు.

బాపిరాజు చెరువుకు సంబంధించి చైర్మన్‌గా వెలగా ఉప్పయ్య, వైస్ చైర్మన్‌గా అల్లు సత్యనారాయణ, డైరెక్టర్లుగా సోమిశెట్టి గణేష్, వెలగా సత్యనారాయణ,కొల్లి అప్పలకొండ, కొయ్యబాబూరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.వీరికి ఎన్నికలఅధికారి ఉమాప్రసాద్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.అలాగే ఉద్దండపురం వూర చెరువు ఎన్నికలు కూడా ఏకగ్రీవమయ్యాయి. చైర్మన్ పదవిని చెరో రెండున్నరేళ్ల చొప్పున ఇద్దరికి కేటాయించారు. మొదటి రెండున్నరేళ్లు చైర్మన్ పదవిని ఎరుబంది సూర్యనారాయణకు, వైస్‌చైర్మన్ పదవిని పొడగట్ల సూర్యగోవిందరావుకు కేటాయించారు. డైరెక్టర్లుగా పొడగట్ల లక్ష్మీసూర్యప్రకాష్, మారం రమణమ్మ, తుమ్మల వీరబ్బాయి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో రైతునాయకులు వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేశ్, వీసం నానాజీ, కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన రమణ, నల్లల రామకృష్ణ, నెట్ల గోవిందు, అల్లూరమణ, పొడగట్ల పాపారావు, పొడగట్ల వెంకటేష్, బచ్చలరాజు, బొల్లం బాబ్జి తదితరులు పాల్గొని ఏకగ్రీవానికి కృషి చేశారు.కొగిత రాయపురాజు చెరువు ఎన్నికల్లో కూడా పార్టీలకతీతంగా చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# శారదా నదిలో ఇసుక తోడేళ్లు

శారదా నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఉచితం మాటున అక్రమార్కులు ఇసుకను భారీగా తోడేస్తూ జేబులు నింపుకొంటున్నారు. నదిలో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతూ పగలురాత్రీ అన్న తేడా లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారు. నెలకు ట్రాక్టర్‌కు రూ.10 వేల చొప్పున రెవెన్యూ, పోలీసు అధికారులకు మామూళ్లు అందుతున్నట్టు భోగట్టా. ఈ మొత్తం వ్యవహారం టీడీపీ నాయకుల కనుసన్నల్లో సాగుతోంది. వాల్టా చట్టానికి తూట్లు పొడిచి ఇష్టానుసారంగా చాలా లోతువరకూ నదీ గర్భంలో తవ్వకాలు జరుపుతుండడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతాయేమోనని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు, రవాణా
- ట్రాక్టర్‌కు నెలకు రూ. 10 వేలు మామూళ్లు
- దేవరాపల్లి మండలంలో ఇసుకాసురుల అడ్డగోలు దోపిడీ
- గ్రామాల్లో దర్జాగా ఇసుక వేలం దందా
- బ్లేడ్ ట్రాక్టర్లతో భారీగా తవ్వి తరలింపు
- పొంచి ఉన్న ప్రమాదం



శారదా నదిలో భారీ గొయ్యి



తెనుగుపూడిలో భారీగా గొయ్యి తవ్వి ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న కూలీలు

దేవరాపల్లి: మండలంలో ఇసుకాసురులు పట్టపగలే అక్రమంగా తవ్వకాలు జరపుతూ జిల్లా సరిహద్దులు దాటించి లక్షలాది రూపాయలు వెనుకేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను దోచుకుపోతున్నా మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్య వైఖరితో పాటు ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీని టీడీపీ నాయకులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు.

**వంద ట్రాక్టర్లు.. ఐదు వందల ట్రిప్పులు**

మండలంలో సుమారు వంద ట్రాక్టర్లతో పగలు రాత్రీ తేడాలేకుండా ఇసుకను తరలించేస్తున్నారని అంచనా. ఒక్కో ట్రాక్టర్ ద్వారా రోజుకు ఐదు నుంచి ఆరు ట్రిప్పుల్లో రవాణా చేస్తున్నారు. సుమారు 500 వందల ట్రాక్టర్ల ఇసుకను తరలించేస్తున్నారని తెలిసింది.

ఒక ట్రిప్‌కు అత్యధికంగా నిర్మాణదారుల నుంచి రూ.2,500 వసూలు చేయవలసి ఉండగా దూరం బట్టీ రూ.10 వేల వరకూ వసూలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారని తెలిసింది. టీడీపీకి చెందిన కొంతమంది నాయకుల అండదండలతో అదే పార్టీకి చెందిన కొంతమంది ట్రాక్టర్ల యజమానులు అటు అధికారులకు, ఇటు మిగతా ట్రాక్టర్ల యజమానులకు మధ్యవర్తిత్వం వహించి మామూళ్ల బేరం కుదిర్చారని సమాచారం.

**జాతరను తలపిస్తున్న నదీ తీరాలు**

మండలంలో శారదా నదీ తీరంలో పది గ్రామాలున్నాయి. తెనుగుపూడి, వెంకటరాజుపురం, మారేపల్లి, తిమిరాం, కలిగొట్ల, వేచలం, బోయిలకింతాడ, తామరబ్బ, చింతలపూడి తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికార టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. శారదానదిలో బ్లేడ్ ట్రాక్టర్లతో తవ్వకాలు జరపుతున్నారు. తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్నట్లుగా రేయింబవళ్లు అక్రమార్కులు ఇసుక దోపిడీ చేస్తున్నారు. శారదానది పరివాహక ప్రాంతాల్లో ఏ సమయంలో చూసినా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, పెద్ద సంఖ్యలో కూలీ ఉంటుండడంతో అక్కడి వాతావరణం జాతరను తలపిస్తోంది. తెనుగుపూడిలో గుట్టు చప్పుడు కాకుండా రూ. 5 లక్షలకు ఇసుక వేలం పాట నిర్వహించి మరీ అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నట్లు సమాచారం.

| | |
|---|---|
| మండలం | : దేవరాపల్లి |
| శారదా నదీ పరీవాహక గ్రామాలు | : 10 |
| ట్రాక్టర్లు | : 100 |
| రోజుకు ట్రిప్పులు | : 500 |
| అధికారులకు మామూళ్లు (ట్రాక్టర్‌కు, నెలకు..) | : రూ.10 వేలు ? |

**గోతులతో పొంచి ఉన్న ప్రమాదం**

వాల్టా చట్టం నిబంధనలకు తూట్లు పొడుస్తూ శారదానదిలో 20 నుంచి 30 అడుగుల మేర గోతులు తవ్వి ఇసుకను తోడేస్తున్నారు. దీంతో నదిలో కనుచూపు మేర ఎటు చూసిన భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. ఇలా ఇసుక తవ్వకాలు చేపడుతున్న సమయంలో మండలంలోని తెనుగుపూడిలో ఇటీవల ఇసుక జారి పడి ఇద్దరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. భారీ గోతులు తవ్వి ఇసుకను తోడేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు ఆ గోతుల్లో పశువులు, రైతులు పడి మునిగిపోయే ప్రమాదం ఉందని సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు.

**మామూళ్ల మత్తులో ...**

మండలంలో పోలీసులు, రెవెన్యూ అధికారులకు నెలకు ట్రాక్టర్‌కు రూ. 10 వేల చొప్పున ముడుపులు చెల్లిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మామూళ్లు అందుతుండడంతోనే ఇసుక దోపిడీవైపు అటు పోలీసులు గాని, ఇటు రెవెన్యూ అధికారులు గాని కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**ఎస్పీ ఆదేశాలు బేఖాతరు**

దేవరాపల్లి పోలీస్‌స్టేషన్ సందర్శనకు వచ్చిన ఎస్పీ తుహిన్ సిన్హా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సంగతి విధితమే. నిబంధనలకు అతిక్రమించి ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించినా ఇసుకాసురు బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు.

## రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో మెరిసిన సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి



బంగారు పతకం, సర్టిఫికెట్ స్వీకరిస్తున్న చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

చోడవరం: రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతా లక్ష్మి బంగారు పతకం సాధించారు. 44వ ఏపీ స్టేట్ అథ్లెటిక్స్ పోటీలు కృష్ణాజిల్లా గుడివాడలో జరుగుతున్నాయి. 14వ తేదీన జరిగిన 40 సంవత్సరాల మహిళల విభాగం లాంగ్‌జంప్, షాట్‌పుట్ పోటీల్లో చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి పాల్గొన్నారు. లాంగ్‌జంప్‌లో మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా షాట్‌పుట్‌లో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. ఈమె గతంలో అనేక సార్లు మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన గీతాలక్ష్మికి పలువురు అభినందనలు తెలిపారు.

## న్యాయంపూడి సర్పంచ్‌కు పౌర సన్మానం

- బ్రహ్మరథం పట్టిన గ్రామస్తులు



సర్పంచ్ వరహాల బాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

నక్కపల్లి: గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర ప్రభుత్వ అవార్డు అందుకున్న న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలబాబుకు శనివారం పౌర సన్మానం జరిగింది. గ్రామంలో సమృద్ధి నీటి సరఫరా విభాగంలో న్యాయంపూడి పంచాయతీ ఏటా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ శతత్ వికాస్ పురస్కారానికి ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ నెల 11న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి సర్పంచ్ వరహాల బాబు మెమెంటో, ప్రశంసాపత్రం, గ్రామాభివృద్ధి కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇచ్చిన కోటి రూపాయల చెక్కును అందుకున్నారు. జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.42 లక్షలతో ఇంటింటికీ కుళాయిల పథకాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ అవార్డుకు జిల్లాలో న్యాయంపూడి, తగరంపూడి పంచాయతీలు ఎంపికయ్యాయి. తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించి న్యాయంపూడి పంచాయతీకి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన సర్పంచ్ వరహాల బాబును గ్రామస్తులు శనివారం సన్మానించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజలు వరహాలబాబును గ్రామంలో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక వేదికపై ఘనంగా పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా న్యాయంపూడి పంచాయతీకి గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. గ్రామస్తుల ప్రోత్సాహంతో మరింత అభివృద్ధి చేయాలన్నారు. సర్పంచ్ వరహాలబాబు మాట్లాడుతూ అవార్డు బాధ్యతను మరింత పెంచిందన్నారు. గ్రామస్తుల సహకారం వల్లే తాను పంచాయతీని అభివృద్ధి చేయగలిగానన్నారు. ఈ కీర్తి గ్రామస్తులందరికీ దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దర్శన క్యూలు కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల, దేవస్థానం, ఆర్టీసీ బస్సులు భక్తులతో రద్దీగా మారాయి. అన్నప్రసాద వితరణ భవనం వద్ద భక్తులు బారులు తీరారు.

## అల్లు అర్జున్ అరెస్టు బాధ కలిగించింది

సినీ నటి శ్రీలీల



డాబాగార్డెన్స్: సినీ హీరో అల్లు అర్జున్ అరెస్టుపై యావత్తు సినీరంగం బాధ పడిందని.. తాను ఆయన అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు హీరోయిన్ శ్రీలీల అన్నారు. డాబా గార్డెన్స్‌లో చెన్నై షాపింగ్ మాల్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లు అర్జున్ అరెస్టు తనకు ఎంతో బాధ కలిగించిందన్నారు. ఆయన బెయిల్ రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

# అధికారుల పక్షపాత వైఖరిపై ఆందోళన

- ఎ.కొత్తపల్లిలో ఎన్నిక వాయిదాపై ఆగ్రహం



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ



ఎ.కొత్తపల్లిలో అధికారుల తీరును నిరసిస్తూ బైఠాయించిన సర్పంచ్ మద్దతుదారులైన రైతులు

దేవరాపల్లి : మండలంలోని ఎ. కొత్తపల్లి రెడ్డివానిపెద్దివాని చెరువుకు సంబంధించిన నీటి సంఘం ఎన్నిక ప్రక్రియలో పోలింగ్ అధికారులు కూటమి నేతలకు అనుకూలంగా వ్యవహరించడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అక్కడే ఉన్న ఎస్ఐ మల్లేశ్వరరావు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పోలింగ్ కేంద్రానికి సకాలంలో రాలేదని స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకట రమణ మద్దతుదార్లు కొందరిని లోపలికి అనుమతించ లేదు. దీంతో పోలింగ్ కేంద్రం బయట నిరసన చేపట్టారు. చివరికి పోలింగ్ కేంద్రం లోపల ఉన్న వారితోనే ఎన్నిక నిర్వహిస్తామని ఎన్నికల అధికారి, స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కె.అప్పారావు చెప్పడంతో శాంతించారు. మరలా కొద్ది నిమిషాలకే ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించడంతో రసాభాసగా మారింది. అకారణంగా ఎన్నిక ఎలా వాయిదా వేస్తారని సర్పంచ్ చింతల వర్గీయులు అధికారుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఓటర్ల బలం తక్కువగా ఉండడంతో ఓటమి తప్పదని గ్రహించి ఎన్నికల అధికారులను అడ్డం పెట్టుకొని టీడీపీ కూటమి నాయకులు వాయిదా కుట్రకు తెర తీసారని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ విమర్శించారు. దేవరాపల్లి మండలంలో ఐదు మైనర్, నాలుగు మీడియం నీటి సంఘాల ఎన్నికలు అధికారుల పక్షపాత వైఖరితో ఉద్రిక్త పరిస్థితుల నడుమ జరిగాయి. దేవరాపల్లి ఉయ్యాల చింత గెడ్డ సాగు నీటి ఎన్నికలో టీడీపీ కూటమి నేతలు పోటీ పడ్డారు. మారేపల్లికి చెందిన 8వ డైరెక్టర్ స్థానానికి ఒకే నామినేషన్ వచ్చినప్పటికీ ఒక వర్గం టీడీపీ నేతకు అధికారులు అనుకూలంగా వ్యవహరించి వాయిదా వేశారు. కలిగొట్ల బ్రాంచ్ కెనాల్ నీటి సంఘం పరిధిలోని తిమిరాం, కలిగొట్లకు చెందిన రెండు డైరెక్టర్ల ఎన్నికను వాయిదా వేశారు. ఈ ఎన్నికలకు సంబంధించి కొందరు కూటమి నేతలకు సైతం నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో బాహాటంగా అసంతృప్తి వెళ్లగక్కారు.

# యువగళం హామీలు నెరవేర్చాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్



యలమంచిలి రూరల్: విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గత యువగళం పాదయాత్రలో విద్యా రంగానికి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. రామ్మోహన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత సినిమాహాలు వద్ద ఎస్ఎఫ్ఐ 3వ జిల్లా మహాసభల్లో చివరి రోజు శనివారం ఆయన రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలు విడుదల చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో డైట్ చార్జీలను తెలంగాణా ప్రభుత్వం మాదిరిగా పెంచాలన్నారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని నేతలు హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తక్షణమే అమలు చేయాలని, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని, అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని మహాసభల్లో ప్రధానంగా తీర్మానించారు.

### జిల్లా కార్యవర్గం ఎన్నిక

మహాసభల చివరి రోజు ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మైలపల్లి బాలాజీ(యలమంచిలి), మామిడి రమణ(అనకాపల్లి), ఉపాధ్యక్షుడిగా గౌతం కుమార్(నర్సీపట్నం), సహాయ కార్యదర్శులుగా ఏ అభి (యలమంచిలి), పీ కృపానంద్(పాయకరావుపేట), జిల్లా కమిటీ సభ్యులుగా జనార్దన్, విజయ్,వెంకట నాగేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సుమారు 150 మంది ప్రతినిధులు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి మహాసభలకు హాజరయ్యారు.

## మంచు మనోహరం






ఉదయం తొమ్మిది గంటలైనా మంచు దుప్పటి వీడలేదు. నాలుగైదు అడుగుల దూరంలో ఉన్న మనుషులు సైతం కనిపించని పరిస్థితి. దీంతో వాహనదారులు లైట్ల సాయంతోనే ప్రయాణాలు సాగించారు. మన్యం ప్రాంతాన్ని తలపించేలా చోడవరంలో పొగమంచు తీవ్రంగా కురిసింది. గడిచిన మూడేళ్లలో ఎప్పుడూ లేనంతగా మంచు కురుస్తూ వణికిస్తోంది. రాత్రి సమయాల్లో 15 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రకృతి ప్రేమికులు మంచు అందాలను ఆస్వాదిస్తున్నారు. శనివారం తీవ్రంగా మంచుకురవడంతో చోడవరం ప్రాంతం ఏజెన్సీని తలపించింది.

\- చోడవరం

# ఎన్నికల్లో కూటమి అధికార దుర్వినియోగం

- మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం: సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు.నిబంధనలకు విరుద్ధంగా ఈ ఎన్నికలు జరిపించారని ధర్మశ్రీ ధ్వజమెత్తారు. చాలా చోట్ల ఎన్‌వోసీలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలను తమ పార్టీ బహిష్కరించిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతులకు పూర్తిగా మోసం చేసిందని ధర్మశ్రీ తెలిపారు.

# బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

దేవరాపల్లి: బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని దేవరాపల్లి పోలీస్‌లు అరెస్టు చేశారు. రామాలయ సమీపంలోని పాన్ షాప్‌లో అక్రమంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు శనివారం ఆకస్మికంగా దాడి చేసి తనిఖీలు చేపట్టారు. షాపులో విక్రయానికి ఉంచిన ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వాహకుడు డి. శ్రీనివాసురావుపై ఎస్ఐ టి.మల్లేశ్వరరావు కేసు నమోదు చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు



## మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి: మండలంలో బవులవాడ గ్రామానికి చెందిన శానాపతి జగ్గారావు వద్ద 11 మద్యం క్యాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ సంతోష్ శనివారం తెలిపారు. తుమ్మపాల గ్రామంలో ద్విచక్రవాహనాలు తనిఖీ చేస్తుండగా, అతడిని పట్టుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం వేద పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఈ నెల 13న అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌లకు శనివారం ఫిర్యాదు అందింది. అచ్యుతాపురం మండలంలో తన స్వగ్రామం హరిపాలెం వెళ్లివస్తానని చెప్పి నేటికీ పాఠశాలకు తిరిగి రాకపోవడంతో విద్యార్థి తండ్రి పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

## మర్చంట్ నేవీ ఉద్యోగి ఆత్మహత్య



మృతుడు రమణ

ఎస్.రాయవరం: మనస్తాపంతో మర్చంట్ నేవీ ఉద్యోగి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు... మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన పోలిశెట్టి రమణ(50) మర్చంట్ నేవీలో పని చేస్తున్నాడు. అతడికి భార్య ఉమాదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రావ్యకు ఎంసెట్ ర్యాంకు వచ్చింది. ఓ ప్రైవేటు కళాశాలలో ఉచిత సీటు వచ్చింది. కళాశాలలో కుమార్తెను చేర్పిద్దామని భర్తకు భార్య శుక్రవారం చెప్పింది. అందుకు అంగీకరించని అతడు తమ కుమార్తెకు వివాహం చేస్తానని వాదనకు దిగాడు. ఈక్రమంలో కుమార్తె శ్రావ్యను చదివిస్తానని కళాశాలకు వెళ్తున్నామని చెప్పడంతో, పొలంలో చల్లేందుకు తెచ్చిన గడ్డిమందును మద్యం మత్తులో ఉన్న రమణ తాగాడు. గమనించిన భార్య చుట్టుపక్కల వారిని పిలిచి హుటాహుటిన నక్కపల్లి సీహెచ్‌సీకి, ఆపై తుని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు శనివారం తెలిపారు.

# సినిమా చూసొస్తూ విద్యార్థి దుర్మరణం

- లైనుకొత్తూరు వద్ద ఢీకొన్న రెండు ద్విచక్ర వాహనాలు



మృతుడు దుర్గా ప్రసాద్ (ఫైల్ )

యలమంచిలి రూరల్: స్నేహితులతో సరదాగా సినిమాకి వెళ్లి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ రాయవరం మండలం రేవుపోలవరం గ్రామానికి చెందిన దారబోయిన దుర్గాప్రసాద్(14) శనివారం రాత్రి దుర్మరణం పొందాడు. దీనికి సంబంధించి మృతుని బంధువులు, యలమంచిలి ప్రభుత్వాస్పత్రి సిబ్బంది నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. రేవుపోలవరంకు చెందిన సుమారు 15 మంది విద్యార్థులు ద్విచక్రవాహనాలపై యలమంచిలి పట్టణంలో పుష్ప సినిమా చూసి తిరిగి తమ గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. వీరిలో ఇద్దరు పదో తరగతి విద్యార్థులు దుర్గాప్రసాద్, ప్రవీణ్ మినహా మిగిలిన వారంతా యలమంచిలి సమీపంలో ఒక పెట్రోల్ బంక్ వద్ద ఆగారు. ఇద్దరు విద్యార్థులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం లైనుకొత్తూరు వద్ద పాల క్యారేజితో రైతు నడుపుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. వేగంగా ప్రయాణిస్తున్న బైకు పక్కనే ఉన్న భవనం గోడను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మరో విద్యార్థి ప్రవీణ్, రైతు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దర్నీ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



# అక్కా.. వెళ్లిపోయావా..

- బైక్ సైడ్ మిర్రర్‌ను లారీ తాకడంతో బోల్తా
- ఆమె తలపై లారీ చక్రం వెళ్లడంతో దుర్మరణం
- తమ్ముడికి స్వల్పగాయాలు



రోడ్డుపై విజయలక్ష్మి మృతదేహం, పక్కన గాయాలతో గిరిబాబు



ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిబాబు

అనకాపల్లి: మరికొద్ది సేపట్లో ఆనందం పంచుకోవాల్సిన ఆ ఇంట్లో దుర్వార్త వినడంతో కశింకోట మండలం వెదురుపర్తి గ్రామం ఒక్కసారిగా శోకసముద్రంలో మునిగిపోయింది. తమ్ముడు భార్య గర్భిణీ కావడంతో శనివారం సాయంత్రం ఆమెను పుట్టింటికి పంపించేందుకు కావాల్సిన సరంజామా అంతా తెచ్చేందుకు అతడితో ద్విచక్ర వాహనంపై బయలుదేరిన అక్క వి. విజయలక్ష్మి(40) దుర్మరణం చెందగా, తమ్ముడు మళ్ల గిరిబాబు (35)కు గాయాలయ్యాయి. అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామంలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వీరు తమ ద్విచక్ర వాహనంపై కశింకోట నుంచి అనకాపల్లి వెళ్తున్నారు. అదే సమయంలో తుని నుంచి విశాఖ వెళ్తున్న లారీ వెనుక నుంచి వచ్చి బైక్ సైడ్ మిర్రర్‌ను స్పీడ్‌గా తాకడంతో ఒక్కసారిగా పడిపోయారు. దాంతో లారీ వెనుక చక్రం విజయలక్ష్మి తలపై నుంచి వెళ్లిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, గిరిబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. కళ్ల ముందే తన అక్క చనిపోవడంతో అతడు జీర్ణించుకోలేకపోయాడు. అక్కా వెళ్లిపోయావా అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. గాయపడిన అతడిని హైవే అంబులెన్స్‌లో ఎన్టీఆర్ ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. గిరిబాబు భార్య ఝాన్సీలక్ష్మి గర్భిణి కావడంతో పుట్టింటికి పంపించేందుకు పూలు, ఇతర సామగ్రి కొనుగోలు నిమిత్తం వారిద్దరూ ద్విచక్ర వాహనంపై బయలు దేరిన సమయంలో ఈ ప్రమాదానికి గురయ్యారు. గిరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ అశోక్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. విజయలక్ష్మి తన భర్త, కుమారుడుతో విశాఖ నగరంలోని అక్కయ్యపాలెంలో ఉంటున్నట్టు తెలిసింది.

# టిప్పర్‌లారీ -బొలేరో వాహనం ఢీ

- వెంకటాపురంలో ఇరువురు డ్రైవర్లకు గాయాలు



వెంకటాపురం వద్ద గాజువాక -యలమంచిలి బైపాస్ రోడ్డులో ఢీకొన్న లారీ, బొలేరో వ్యాన్

రాంబిల్లి (యలమంచిలి): టిప్పర్‌లారీ, బొలేరో వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఇరు వాహనాల డ్రైవర్లు గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం మేరకు.. రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామం సమీపంలో గాజువాక -యలమంచిలి బైపాస్ రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రాంబిల్లి నుంచి వెంకటాపురం వెళ్తున్న టిప్పర్ లారీ, వెంకటాపురం నుంచి సౌండ్ సిస్టంను తరలిస్తున్న బొలేరో వ్యాన్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. వెంకటాపురం గ్రామానికి చెందిన ఇరువురు డ్రైవర్లు కిల్లాడి గంగునాయుడు, కిల్లాడి శివ గాయాల పాలయ్యారు. వారిని స్థానికులు, బంధువులు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో గాజువాక -యలమంచిలి రోడ్డులో వాహనాలు అడ్డుగా నిలిచిపోవడంతో రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు తెలిపారు.

# సారా బట్టీ, బెల్లం పులుపు ధ్వంసం

చోడవరం రూరల్: స్థానిక ఎక్సైజ్ సబ్ డివిజన్ పరిధిలోని బుచ్చెయ్యపేట మండలం గొర్లెపాలెంలో పెద్ద ఎత్తున నాటు సారా తయారు చేస్తున్న బట్టీని, నిల్వ చేసిన పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఇన్‌స్పెక్టర్ కె.వి.పాపునాయుడు శనివారం తెలిపారు. గ్రామానికి దక్షిణ భాగంలో రెండు కిలో మీటర్ల దూరంలోని సరుగుడు తోటలో సారా తయారు చేస్తుండగా ఎస్ఐ ఎం.శేఖరం హెచ్‌సీలు ఎం.అప్పారావు, డి.గణేశ్వరరావు, సిబ్బంది ఆర్.రాంబాబులతో కలసి దాడులకు వెళ్లగా, సార తయారుదారులు పరారయ్యారని పేర్కొన్నారు. దాంతో సారా తయారీ బట్టీని, 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారని తెలిపారు. పరారైన వారి కోసం ఆరా తీస్తున్నామని, విచారణ అనంతరం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.



సారా బట్టీ వద్ద ఎక్సైజ్ సిబ్బంది



బట్టీని ధ్వంసం చేస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### శీతాకాలం వ్యాధులపై అవగాహన


వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామ్మూర్తి

అనకాపల్లి: మండలంలోని వెంకుపాలెం వృద్ధాశ్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు సంస్థ చైర్మన్, వైద్యుడు జి.రామ్మూర్తి ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉదయం సూర్యోదయంలో గంట పాటు ఎండ తగిలేలా చూసుకోవాలన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఉచితంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ హిమజా కిరణ్, సభ్యులు వెంకటరమణ, కన్నేశ్వరరావు, ఉగ్గిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ వినియోగంపై ప్రజలకు పొదుపు నేర్పాలి

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడం కాకుండా విద్యుత్ వినియోగంపై ప్రజలకు పొదుపు నేర్పాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా విద్యుత్‌ను పొదుపు చేసేందుకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నేటి పొదుపు భావితరాలకు ఉపయోగపడుతుందన్నారు. 50 యూనిట్ల కంటే తక్కువగా విద్యుత్‌ను ఉపయోగించే గృహాలకు ప్రభుత్వం ఉచితంగా రేషన్ డిపోల ద్వారా రెండు కేజీల బియ్యం లేదా కిలో పంచదార అందజేస్తామని ప్రకటించినట్లయితే లక్షలాది యూనిట్లు పొదుపు చేయవచ్చన్నారు.

### 120 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ

మునగపాక: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరచుకోవాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటకు చెందిన స్వర్గీయ మొల్లేటి శంకర్ గణేష్ జ్ఞాపకార్థంగా అతడి తల్లిదండ్రులు పరమేశ్వరరావు, మాణిక్యం దంపతుల ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన దుప్పట్లను 120 మంది పేదలకు శుక్రవారం రాత్రి పంపిణీ చేశారు. గంగప్పలనాయుడు మాట్లాడుతూ చిన్నవయస్సులో గణేష్ మృతి చెందడం బాధాకరమన్నారు. అతని పేరిట ఆర్చితోపాటు అనకాపల్లి నుంచి మూలపేటకు వచ్చే దారిలో 15 వీధి దీపాల ఏర్పాటుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 3,370 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 3,830 | 5,200 |
| మొదటి రకం | 3,420 | 4,210 |
| రెండో రకం | 3,170 | 3,810 |
| మూడో రకం | 3,000 | 3,160 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| పుష్ప-2 | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| సన్ని | : పర్తిసాయి |
| మిస్‌యూ | : షిర్డీసాయి |
| జీబ్రా | : వెంకటేశ్వర |
| ప్రణయ గోదావరి | : శ్రీసత్య |
| పుష్ప-2 | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 417 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.



# సర్వేలకే పరిమితం

- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వ హయాంలో 540 సేవలతో సచివాలయాలు కళకళ
- నేడు ప్రాధాన్యం కోల్పోతున్న వైనం


7వ సచివాలయంలో గత పాలనలో సేవల కోసం వచ్చిన ప్రజలు (ఫైల్)

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి వద్దే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సచివాలయ వ్యవస్థ ద్వారా అందేవి. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి తాము అధికారం చేపట్టిన మరుక్షణమే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఓటర్లకు చెప్పి తీరా గెలిచాక ఆ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారు. దశల వారీగా సచివాలయ వ్యవస్థను నిర్వీరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలు సర్వే పనులు అప్పగించిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను అనేక ఇబ్బందులకు గురి చేస్తోంది. టార్గెట్ అందుకోకపోతే విధుల నుంచి తొలగించేందుకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని ప్రభుత్వం హుకుం జారీ చేస్తోంది.

**వైఎస్సార్‌సీపీ పాలనలో ఉద్యోగుల విధులు..**

పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5 సాధారణ పరిపాలన, గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధులు నిర్వర్తించేవారు. డిజిటల్ అసిస్టెంట్ 540 రకాల సేవలకు సంబంధించి కంప్యూటర్‌లో నిక్షిప్తం, డాక్యుమెంటేషన్, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేసేవారు. సెరికల్చర్, అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్లు సచివాలయ పరిధిలో ఆయా శాఖలకు సంబంధించి సహాయకులుగా విధులు నిర్వర్తిస్తు, రైతు సేవా కేంద్రాల్లో అన్నదాతలకు విత్తనాలు, పురుగు మందుల సరఫరా, పంటల బీమా తదితర సేవలందించేవారు. ఏఎన్ఎంలు ఆశ వర్కర్ల సహాయంతో వైద్య సేవలు అందించేవారు. కరోనా వంటి విపత్తులో సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రాణాలను లెక్క చేయకుండా విధులు నిర్వర్తించారు. మండల సర్వేయర్లకు సహాయకులుగా విలేజ్ సర్వేయర్లు, పాడి రైతులకు యానిమల్ హజ్బెండరీ అసిస్టెంట్లు సేవలు అందించేవారు.

**కూటమి పాలనలో..**

టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దశల వారీగా సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బడుగు, బలహీన వర్గాలు, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేయడంలో ప్రభుత్వం విఫలమైనట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా 540 రకాల సేవలు అందిస్తే, కూటమి ప్రభుత్వం ఆ సేవలకు మంగళం పాడేందుకు సిద్ధంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులు** హౌసింగ్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఎంఎస్ఎంఈ (చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు)పై రుణాల సర్వే, ఎన్‌పీసీఐ లింకేజీ, ఆధార్‌తో బ్యాంకు ఖాతాల లింక్, ఇంటింటా ఆరోగ్య సర్వే, స్వర్ణ పంచాయతీ డేటా ఎంట్రీ, ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ విద్యార్థులకు రుణాల సర్వే, పాఠశాలల విజిట్, టాయ్‌లెట్ల ఫొటోల అప్‌లోడింగ్, సంచార జాతుల సర్వేలతో పాటు ప్రతి నెలా సామాజిక పింఛన్ల అందజేత వంటి విధులు నిర్వర్తిస్తున్నారు.

**నాడు కళకళ.. నేడు వెలవెల..**

వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు పలు రకాల సేవలు అందించేవారు. దీంతో సచివాలయాలు లబ్ధిదారులతో కిటకిటలాడేవి. కూటమి ప్రభుత్వంలో ఈ సేవలకు మంగళం పాడుతుండడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులను నేటి పాలనలో సర్వేలకే ఉపయోగిస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో 27, మండలంలో 26 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కొక్క సచివాలయంలో 10 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. మొత్తం 530 మంది ఉద్యోగులు కూటమి ప్రభుత్వంలో సర్వేలకు, వృద్ధాప్య పింఛన్ల పంపిణీకి మాత్రమే పరిమితమయ్యారు.

**చిన్నచూపు తగదు..**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు 6 మాసాలు అవుతున్నప్పటికీ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదు. సచివాలయ ఉద్యోగులను సర్వేలు, వృద్ధాప్య పింఛన్ల పంపిణీకి మాత్రమే ఉపయోగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎన్ని రకాల పథకాలు అమలు చేస్తారో వివరించాలి. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతోంది.



వైఎస్సార్‌సీపీ పాలనలో వలంటీర్లను ఏర్పాటు చేసి కొంత వరకూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించింది. కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా వలంటీర్లను విధుల్లోకి తీసుకుని వారి ద్వారా ప్రభుత్వ పథకాలను సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– కొణతాల హరనాథ్‌బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్

# ఆలయాలకు ధనుర్మాస శోభ

16 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు


కశింకోటలో వెలసిన వేణుగోపాలస్వామి


గవరపేటలో వెలసిన వేంకటేశ్వరస్వామి

కశింకోట: కశింకోటలోని నాలుగు ఆలయాల్లో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. దేవదాయ శాఖకు చెందిన పురాతన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి తెలిపారు. ఈ సందర్భంగా తొలి రోజు ఉదయం 6.38 గంటలకు నెలగంట కార్యక్రమం జరుగుతుందన్నారు. స్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో ప్రధానంగా వచ్చే జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని, స్వామి వారి ఉత్సవ విగ్రహం, గరుడ, రాముని విగ్రహాన్ని గజ వాహనాలపై గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. 11వ తేదీన విష్ణుమూర్తి గోదాదేవిని కల్యాణం చేసుకోవడానికి అంగీకారం తెలిపిన రోజుగా 'కూడారై'ఉత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి రెండు రకాల పాయసాన్ని నివేదించి పంపిణీ చేస్తామన్నారు. 13న భోగి సందర్భంగా గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 14న సంక్రాంతి ఉత్సవం, ఆలయ ప్రాంగణంలో తీర్థ మహోత్సవం జరుపుతామన్నారు. ఉత్సవాల నెల రోజులు ప్రతి రోజు వేకువ జామున విష్ణు సహస్ర నామం, తిరుప్పావైపై పారాయణ కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొవాలన్నారు. అలాగే స్థానిక వేంకటేశ్వర ధ్యాన మందిరంలో ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. విష్ణుమూర్తి దశావతారాలను మూడు రోజులకొకటి వంతున అలంకరించి పూజలు నిర్వహిస్తామన్నారు. ఇక గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు నిర్వహించి మూడు రోజులకొక విష్ణుమూర్తి దశావతారాలను అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు తెలిపారు. భోగి రోజు గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అలాగే లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కూడా ధనుర్మాసోత్సవాలు నిర్వహించి ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి తెలిపారు.

## ఘర్షణ వాతావరణంలో నీటి సంఘాల ఎన్నికలు


తుమ్మపాలలో సాగునీటి ఎన్నికల నిర్వహణ దృశ్యం

తుమ్మపాల: సాగునీటి సంఘాల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తప్పుకోవడంతో కొన్ని గ్రామాల్లో టీడీపీ, జనసేన పార్టీల మధ్య పోటీ జరిగింది. దీంతో కూటమి నాయకులు రెండు రోజుల క్రితమే పాలక వర్గాలను ఏకగ్రీవంగా తీర్మానించుకుని శనివారం జరిగిన ఎన్నికల్లో పాల్గొన్నారు. మండలంలో సీతానగరం, కుంచంగి, వెంకుపాలెం తదితర గ్రామాల్లో కూటమి నాయకుల ముందస్తు తీర్మానానికి భిన్నంగా టీడీపీ, జనసేన నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలతో ఎన్నికలు జరిగాయి. జనసేన పార్టీకి చెందిన వారిని అధ్యక్షుడిగా తీర్మానించిన చోట టీడీపీ వ్యక్తులను గెలుపించుకోవడంతో నాయకుల మధ్య బేధాభిప్రాయాలు బయటపడ్డాయి. కొన్ని చోట్ల పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలకు సర్దిచెప్పి ఎన్నికలు పూర్తి చేశారు.

## ఆరు సాగునీటి సంఘాలకు ఎన్నికలు పూర్తి


డీపీఎన్ హైస్కూల్లో కాశీమదుం సాగు నీటి సంఘం ఎన్నిక నిర్వహిస్తున్న అధికార బృందం

కశింకోట: మండలంలోని ఆరు సాగునీటి సంఘాలకు శనివారం ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించారు. అన్ని సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి. కశింకోటలోని కాశీ మదుం గ్రోయిన్ సాగు నీటి సంఘానికి ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షునిగా జనపరెడ్డి అప్పారావు, ఉపాధ్యక్షునిగా నడిపల్లి పడమటయ్య ఎన్నికయ్యారు. అలాగే వెదురుపర్తి గ్రోయిన్ సంఘానికి అధ్యక్షునిగా కుకలా రమణ, ఉపాధ్యక్షునిగా అరిగా అప్పారావు, బయ్యవరం పెద్ద చెరువు కాలువ సంఘానికి గూడెపు రమ, ఉపాధ్యక్షునిగా తూరిబిల్లి అప్పారావు, గొబ్బూరు కాలువ సంఘానికి అధ్యక్షునిగా ఇందల రమణ, ఉపాధ్యక్షునిగా కాపిశెట్టి తాతారావు, పేరంటాలపాలెం గ్రోయిన్ సంఘానికి అధ్యక్షునిగా బండారు శేషబాబు, ఉపాధ్యక్షునిగా పువ్వల వెంకటస్వామి, ఉగ్గినపాలెం కాలువ సంఘానికి అధ్యక్షునిగా బద్ది గోవింద, ఉపాధ్యక్షునిగా తిర్రి వెంకట సత్యారావు ఎన్నికయ్యారు. వీరితో పాటు డైరెక్టర్లు ఎన్నికయ్యారు. కశింకోటలో కాశీమదుం గ్రోయిన్ సంఘానికి ఏవో ఎ.ఎ.ఖాన్ పర్యవేక్షణలో ఎన్నిక ఏకగ్రీవం అయింది. ముందుగా డైరెక్టర్లను ఎన్నుకుని వారి నుంచి చైర్మన్, ఉపాధ్యక్షుని ఎన్నుకున్నారు. అలాగే వెదురుపర్తి, బయ్యవరం, పేరంటాలపాలెం సంఘాల ఎన్నికలు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లోను, గొబ్బూరు సంఘం ఎన్నిక చింతలపాలెంలోను, ఉగ్గినపాలెం ఎన్నిక బుచ్చియ్యపేటలోను నిర్వహించారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.వి. రవికుమార్, సిబ్బంది ఎన్నికలను పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా నరసాపురం ఆనకట్ట సంఘం ఎన్నికను యలమంచిలి మండలం జంపపాలెంలో నిర్వహించారు. ఆనకట్ట ఇక్కడే ఉన్నా అక్కడ ఎక్కువ డైరెక్టర్ల స్థానాలు ఉండటంతో అక్కడ ఎన్నిక జరిగింది.

## ఘనంగా దత్తాత్రేయ జయంతి


దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్త పీఠం నిర్వాహకుడు వేదుల శంకర భరద్వాజ్


దత్తాత్రేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


దత్తాత్రేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


అన్న సమారాధన

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామంలో ఉన్న ఏకైక అనఘా సమేత శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ స్వామి ప్రదర్శనకు ఎక్కువగా మహిళలు, యువత ఉత్సాహంగా హాజరయ్యారు. ఆలయం నుంచి భజనలు, డప్పులతో దత్తాత్రేయ చిత్రపటాన్ని పల్లకిలో నిలిపి పెద్ద ఊరేగింపుగా గిరి ప్రదక్షణ ప్రారంభించారు. అక్కడి నుంచి సుమారు పది కిలో మీటర్ల పొడవున తేగాడ, గంటవానిపాలెం, పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, బయ్యవరం గ్రామాల మీదుగా తిరిగి ఆలయం వరకు ప్రదక్షిణ సాగింది. అక్కడ స్వామి పల్లకికి మంగళహారతులు పలికి దత్త పీఠం నిర్వాహకుడు వేదుల శంకర్ భరద్వాజ్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిలిపారు. ప్రదక్షిణ సందర్భంగా స్వామిని దారి పొడవునా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో స్వామికి ఉదయం క్షీరాభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలు, పూల మాలలు అలంకరించి వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి నిధులు సమకూర్చిన దాత ఎస్‌వీఎస్ఎన్ (శ్రీను) రెడ్డిని దత్త పీఠం తరఫున సత్కరించారు. దత్త పీఠం నిర్వాహకుడు వేదుల బదరీ నారాయణమూర్తి, ప్రధాన అర్చకుడు గుళ్లపల్లి శివకుమార్, సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్, తేగాడ, అనకాపల్లి సహా చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 21న గౌరీపరమేశ్వరుల ఉత్సవం


అమ్మవారి ఉత్సవ గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల తదితరులు

అనకాపల్లి: ప్రశాంత వాతావరణంలో గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహించాలని, ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈనెల 21న జరిగే కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవ గోడ పత్రికలను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవం 1811 నుంచి ప్రతి ఏడాది డిసెంబర్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. పట్టణ పరిధిలో మొదటిసారి కుంచావారి ఉత్సవం జరుగుతుందని, తర్వాత మిగిలిన ఉత్సవాలు జరుగుతాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎం.వీరభద్రరావు(అబ్బులు), కమిటీ సభ్యులు కొమ్మోజు రామకృష్ణ, అద్దేపల్లి పోతురాజు, కుంచా ఆదిబాబు, కుంచా వీరభద్రరావు, చిట్టిబాబు, దివాకర్, సందీప్, సాయి పాల్గొన్నారు.

### ధ్యాన వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



కశింకోట: స్థానిక వేంకటేశ్వర స్వామి ధ్యాన మందిరంలో స్వామిని శనివారం వజ్ర కవచాలంకృతులను చేసి వివిధ రకాల పూలు, తులసి మాలలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామార్చన చేసి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

### వేడుకగా చిల్డ్రన్ క్రిస్మస్

మాకవరపాలెం: చిల్డ్రన్ క్రిస్మస్‌ను వేడుకగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న పెంతెకొస్తు ప్రార్థనా మందిరంలో శనివారం చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. దీనికి వివిధ గ్రామాల నుంచి పిల్లలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రిస్మస్ సమీపిస్తుండడంతో అన్ని చర్చిల ఆధ్వర్యంలో ప్రత్యేక కూటములు ఏర్పాటు చేస్తున్నారు. పాస్టర్లు టి.వి.రత్నం, విక్టర్‌పాల్ పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న పదో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి: లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుంటే ఇరువర్గాల కక్షిదారులకు సత్వరం న్యాయం జరిగే అవకాశం ఉంటుందని జిల్లా పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం మెగా లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపాటి సమస్యలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలాన్ని వృథా చేసుకోవద్దని ఆమె చెప్పారు. ఇరువర్గాల కక్షిదారుల సమస్యలు త్వరితగతిన పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు లోక్ అదాలత్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు నాగేశ్వరరావు, ధర్మారావు, విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా వరి కోతలు

కూలీలకు పెరిగిన డిమాండ్


పండిన వరి పంట


పనలుగా ఉంచిన వరి పంట


వరి కుప్పలు

పాయకరావుపేట: మండలంలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. అరట్లకోట, గుంటపల్లి, మంగవరం, నామవరం, సీతారాంపురం, గోపాలపట్నం, పెంటకోట, పాల్తేరు, కుమారపురం, రాజగోపాలపురం, శ్రీరాంపురం, కేశవరం, ఎస్.నర్సాపురం, పెదరాంభద్రపురం తదితర గ్రామాల్లో వరి పంట పండింది. వర్షాలు సకాలంలో కురవడం, తాండవ నుంచి సాగునీరు సక్రమంగా సరఫరా కావడంతో వరి పంట చేతికందివచ్చింది. పలు గ్రామాల్లో వరి కోతలు, కుప్పలు పనులు ముమ్మరంగా సాగడంతో కూలీలకు చేతి నిండుగా పని దొరికింది. స్త్రీ, పురుష కూలీలకు పనులు చురుగ్గా సాగుతున్నవి. మండలంలోని 24 గ్రామాల్లో 7,500 ఎకరాల్లో రైతులు వరి పంటను పండించారు. పండిన వరి పంటను కోసిన తర్వాత పనలపై నాలుగు రోజుల పాటు ఉంచి, అనంతరం పచ్చి ఆరిన తర్వాత కుప్పలు వేస్తున్నారు. ప్రస్తుతం వరి పంటను రైతులు కుప్పలుగా వేసి నిల్వ ఉంచి జనవరిలో సంక్రాంతి ముందు, తర్వాత కూడా ధాన్యం నూర్పులు చేపడతారు. వరి పంట పండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య వాతావరణ హెచ్చరికలకు రైతులు కొంత ఆందోళన చెందినప్పటికీ తుఫాన్ గండం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. వరి పంట కోతలు, కుప్పలు పెట్టడం పనిలో నిమగ్నమయ్యారు.

## కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు


కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


అమ్మవారి ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నీరాజన మంత్ర పుష్ప సేవలను ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామానాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ మండపంలో అమ్మవారికి 249 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. 18 మంది దేవతామూర్తులకు పూజలు, యాగశాలలో సుదర్శన హోమం నిర్వహించారు. విశాఖ జిల్లా కూర్మన్నపాలెం విద్యార్థులచే లవకుశ భరతనాట్యం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రతిష్ట శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ గ్రంథి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.